వేదాంతభేరి

అక్టోబరు 2020

రూ. 10/-

వేదాంతభేరి

అక్టోబరు 2020

రూ. 10/-



ఇతరుల శరీరేంద్రియగుణాదులను చూచి మనోవికారము కలిగినచో అది లోకదృష్టి యనియు, తనయొక్క దేహసంబంధ కుల గోత్ర ఆశ్రమ సౌందర్య గౌరవములతో కూడిన స్త్రీ పురుష భావమును జెందినచో దేహ దృష్టియనియు, శబ్దోచ్చారణ శుద్ధి, మనోవైశాల్యము, విద్యాభిమానము, తపోధ్యానయోగము మొదలుగా గల హృదయమైనచో మనోదృష్టి యనియు అనబడును.

ఇవన్నియు ప్రకృతి గతములు. వీటన్నిటికి సాక్షియై యుండు పరమాత్మభావము కలిగియున్నప్పుడు దివ్యదృష్టి కలుగును. అది యోగదృష్టి యనియు, జ్ఞానదృష్టి యనియు గ్రహించవలెను. అప్పుడు మాత్రమే నిత్యశాన్తి, నిత్యసుఖము జీవులకు లభించును.

– శ్రీ సద్గురు మలయాళస్వాములవారు

ఓం వేదాంతభేరి ఓం

సంస్థాపకులు : శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

సంపుటము : 53 అక్టోబర్ 2020 సంచిక : 10

సంపాదకులు

శ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు

సంపాదక మండలి

శ్రీ సంపూర్ణానందగిరి స్వాములవారు

శ్రీవిజయానంద బ్రహ్మచారి

కె.ఈశ్వర్

డాక్టర్ సముద్రాల లక్ష్మణయ్య, శిరోమణి, ఎం.ఎ.,

డాక్టర్ కె.సర్వోత్తమరావు, ఎం.ఎ., పి.హెచ్.డి.,

శాశ్వత పోషక చందా రూ. 2000/- అంతకుమించి

సంవత్సర చందా రూ. 100/-లు, విడి సంచిక రూ. 10/-లు

విదేశాలకు సంవత్సర చందా (ఎయిర్ మెయిలు) 20 డాలర్లు

చందా పంపవలసిన అడ్రసు : శ్రీ శుకబ్రహ్మాశ్రమము, స్వామి విద్యాప్రకాశానంద నగర్, శ్రీ శుకబ్రహ్మాశ్రమము (పోస్టు) శ్రీకాళహస్తి, పిన్ - 517640 ఫోన్ : 08578- 222239

చందాదారులు ఉత్తర ప్రత్యుత్తరాలలో తమ చందా నెంబరు తప్పక వ్రాయవలెను.

Printed & Published by Sri Vidyaswarupanandagiri swami on behalf of Sri Sukabrahma Ashramam and Printed by B.Viswanadham at C.N. Printer, TIRUPATI, Andhra Pradesh; Published at Sri Sukabramhasramam, Swami Vidyaprakashananda Nagar, Sri Sukabramhasramam Post, Srikalahasti-517 640, Chittoor Dist., Andhra Pradesh.

Editor : SRI VIDYASWARUPANANDA GIRI SWAMI

ఓం వేదాంతభేరి ఓం

అనుష్ఠాన వేదాన్తాన్ని బోధించు మాసపత్రిక

సంపుటము : 53 అక్టోబర్ 2020 సంచిక : 10

విషయ సూచిక

01. ప్రార్థన - 05
02. జీవుడు దాసుడు కాదు-శ్రీవిద్యాప్రకాశానందగిరిస్వాములవారు- 06
03. దేవీ నవరాత్రులు - శ్రీవిద్యాస్వరూపానందగిరి స్వాములవారు- 12
04. ధ్యానము - శ్రీ స్వామి బ్రహ్మానంద - 15
05. సాధన పంచకమ్ - శ్రీ సంపూర్ణానందగిరిస్వాములవారు - 17
06. మనస్సు - శ్రీసర్వాత్మానందగిరిస్వాములవారు -22
07. దవనం కథ - ఆచార్య కె.సర్వోత్తమరావు - 26
08. ధర్మజీవనమంటే ఇచ్చి పుచ్చుకొని జీవించుట - శ్రీ ప్రణవాత్మానంద సరస్వతి స్వాములవారు - 28
09. భాగవతం షష్ఠస్కంధము - శ్రీ మాతా పరావిద్యానందగిరి - 30
10. అనన్య శివాచార్యులు అక్కమహాదేవి - 33
11. నీ వెవరు - శ్రీ ఎ. తారాలక్ష్మి - 39
12. వార్తలు - 42

ముఖచిత్రం
అరిభయంకరి నవదుర్గ

02-10-2020 శుక్రవారం మహాత్మాగాంధీ జయంతి,
23-10-2020 శుక్రవారం సరస్వతి పూజ
24-10-2020 శనివారం దుర్గాష్టమి
25-10-2020 ఆదివారం మహర్నవమి
31-10-2020 శనివారం శ్రీ వాల్మీకి జయంతి

ఇందులోని వ్యాసముల భావములకు వ్యాస రచయితలే బాధ్యులు

ప్రార్థన

1. ఓం దుర్గే స్మృతా హరసి భీతిమశేషజంతోః,
స్వస్థైః స్మృతా మతిమతీవ శుభాం దదాసి ।
దారిద్ర్య దుఃఖ భయహారిణి కా త్వదన్యా,
సర్వోపకార కరణాయ సదార్ద్రచిత్తా ॥

2. ఓం సర్వమంగళమాంగళ్యే శివే సర్వార్థసాధికే ।
శరణ్యే త్ర్యంబకే గౌరి నారాయణి నమోస్తుతే ॥

3. ఓం శరణాగతదీనార్త పరిత్రాణ పరాయణే ।
సర్వస్యార్తిహరే దేవి నారాయణి నమోస్తుతే ॥

4. ఓం సర్వస్వరూపే సర్వేశీ సర్వశక్తి సమన్వితే ।
భయేభ్యస్త్రాహి నో దేవి దుర్గే దేవి నమోస్తుతే ॥

5. ఓం రోగానశేషా నపహంసి తుష్టా
దుష్టాతు కామాన్ సకలానభీష్టాన్ ।
త్వామాశ్రితానాం న విపన్నరాణాం
త్వామాశ్రితా హ్యా శ్రయతాం ప్రయాన్తి ॥

6. ఓం సర్వబాధాప్రశమనం త్రైలోక్యస్యాఖిలేశ్వరి ।
ఏవమేవ త్వయా కార్యం సర్వకాలేషు సర్వదా ॥

7. ఓం నవదుర్గాం మహాకాళిం బ్రహ్మావిష్ణు శివాత్మికామ్ ।
నమామి పరమాం దేవీం మహిషాసురమర్దినీమ్ ॥

8. ఓం జయ త్వం దేవి చాముండే జయభూతార్తి హారిణి ।
జయ సర్వగతే దేవి కాలరాత్రి నమోస్తుతే ॥

9. ఓం నమో దేవ్యై మహాదేవ్యై శివాయై సతతం నమః ।
నమః ప్రకృత్యై భద్రాయై నియతాః ప్రణతాస్మ తామ్ ॥

జీవుడు దాసుడు కాదు

- శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

వాస్తవముగ **జీవుడు ప్రభువేకాని దాసుడు కాదు.** శంకరుడే కాని కింకరుడు కాదు. అజ్ఞానవశమున కింకరత్వమునకు, బానిసత్వమునకు పాల్పడి, ఇంద్రియములు ఆదేశించునట్లు ఆడుచు అల్పమైన జడ పదార్థములకు, క్షణికములగు శబ్ద స్పర్శాది విషయములకు లోబడి పోవుచున్నాడు. పూర్వము బ్రిటిష్ పరిపాలకులకు లోబడి, అస్వతంత్రులై భారతీయులు ఎన్ని ఇక్కట్లు అనుభవించినది సర్వులకు విదితమే కదా! కాని కాలక్రమమున జనులు విజ్ఞతకలవారై, తెప్పరించుకొని, పోయిన తమ స్వాతంత్ర్యము కొఱకై వత్సరముల తరబడి దీర్ఘ పోరాటమును సలిపి, ఎన్నియో త్యాగములు చేసి గుండు దెబ్బలు తిని, జైళ్ళకేగి, ఎట్టకేలకు స్వరాజ్యమును సంపాదించి సుఖశాంతులను బడయగల్గిరి. ఇపుడు ఆఫ్రికా దేశీయులు కూడ అట్లే తెల్లవారి దొరతనమునుండి తప్పించుకొని స్వతంత్ర వాయువును పీల్చుకొనుచున్నారు.

అయితే అనాదికాలము నుండి జీవుడు అనుభవించుచున్న ఈ ఇంద్రియ దాసత్వ స్థితి ఒకరిచ్చినదికాదు. అజ్ఞానము వలన జీవుడు తనకు తాను కోరితెచ్చుకొనినదే. పట్టుపురుగు తన చుట్టును దారము అల్లుకొని, స్వనిర్మిత బంధమున తగులకొని నానాయాతనలను అనుభవించునట్లు జీవుడు కూడ తన నిజస్వరూపమగు సచ్చిదానందాత్మను విస్మరించి మాయామోహమునబడి అల్పమైన వాటికన్నిటికిని తలవంచి, దృశ్య విషయములకు లోబడిపోయి ప్రస్తుత దయనీయస్థితికి దిగజారిపోయినాడు.

ఇకమీదట అట్టి స్థితి కలుగనీయకుండ చూడవలెను. గడచిన దానిని గూర్చి వగచిన ప్రయోజనము లేదు. ఇపుడు చేయవలసిన పనిని గూర్చి తీవ్రముగ ఆలోచించి భవిష్యత్తును ఆశాజనకముగ గావించుకొనవలెను. విషయదాసులు కాకుండ హరిదాసులు కావలెను. రామదాసులు కావలెను. ఇంద్రియములకు, ప్రాపంచిక విషయభోగములకు తలవంచక భగవంతునకు తలవంచవలెను. పోయిన తన వ్యక్తిత్వమును తిరిగి సంపాదించవలెను. "నేను దేహము కాదు, ఇంద్రియములు కాదు, మనస్సు కాదు. వీని యన్నిటికి సాక్షియైన ప్రత్యగాత్మయే' యను అనుభూతిని బడయవలెను. 'చిదానందరూపః శివోఽహమ్. శివోఽహమ్' అని ఎలుగెత్తి పాడవలెను. '**నేను బానిస కాదు. ప్రభువును'** అని పరిపూర్ణముగ నిశ్చయించి, నిర్ణయించి అనుభవించి తదనుగుణ్యముగ వ్యవహరించవలెను.

ఇంద్రియములు కోరిన పదార్థములను వాటికి ఇవ్వరాదు. ఒకింత సంయమమును అభ్యసించి, కొన్ని వ్రతములను, నియమములను శీలించుచు, తాను చెప్పినట్లు ఇంద్రియములు ప్రవర్తించు స్థితికి రావలెను. తన అదుపాజ్ఞలలో అవి మెలగునట్లు చూడవలెను. ప్రాపంచిక పదార్థములయొక్క క్షణికత్వమును గుఱించి పదేపదే యోచించి వాటి యెడల విరక్తిని కలిగియుండవలెను. ఈ ప్రకారముగ దృశ్య విషయములపై మోజు ఎప్పుడు తగ్గిపోవునో అపుడిక మనస్సు బయటకు పరుగిడక, అంతరంగమున ఆత్మోన్ముఖమై వర్తించును.

ఇందుల కెంతయో పట్టుదల అవసరము. పవిత్రత, సహనము, పట్టుదల (Purity, patience, perseverence) అను ధర్మత్రయమును జేబట్టి ఈ జీవితమందె లక్ష్యమును సాధించుటకు తీవ్ర ప్రయత్న మాచరించవలెను. మానవ జన్మ మరల మరల వచ్చునది కాదు.

పునర్గ్రామః పునర్క్షేత్రం పునర్విత్తం పునర్ధనమ్
పునశ్శుభాశుభం కర్మ న శరీరం పునః పునః.

గ్రామము పోయినచో తిరిగి సంపాదించవచ్చును. పొలము పోయినచో తిరిగి సంపాదించవచ్చును. అట్లే ధనము గాని, ఇతర వస్తువులు గాని పోయినచో తిరిగి ఎట్లైన రాబట్టుకొనవచ్చును. కాని అన్ని హంగులతో గూడిన ఈ మానవ శరీరము రాలిపోయినచో తిరిగి అట్టి అనుకూల జన్మను పొందుట కష్టతరము. కాబట్టి వార్ధక్యము దాపురించక పూర్వమే మానవుడు తన లక్ష్యసాధనకై ప్రయత్నించి, విషయదాసత్వమునకు తిలాంజలి యొసంగి తాను ప్రభువగు ఆత్మయే యని పదే పదే చింతన జేయుచు, అట్టి ఆత్మస్థితియందు నిలకడగల్గి బ్రహ్మానంద వైభవ మనుభవించవలెను. బుద్ధిని తీక్షణముగను, పరిశుద్ధ ముగను నుంచుకొని అద్దాని అదుపు, ఆజ్ఞలలో మనస్సు ప్రవర్తించునట్లు చూడవలయును.

మానవుని ఉపాధి ఒక పెద్ద ప్రభుత్వము వంటిది. ప్రభుత్వ యంత్రాంగమందు ప్రభువు మొదలుకొని చిన్న ఉద్యోగివఱకు ఎందఱో వ్యక్తులు పాల్గొనుచు తమ తమ నిర్ణీత విధులను సక్రమముగ నెరవేర్చుచుందురు. పై అధికారియొక్క ఆదేశమును క్రింది అధికారి వినయ విధేయతలతో స్వీకరించి కార్యాన్వితమొనర్చుచుండును. అట్లే ఈ ఉపాధియందును బుద్ధి, మనస్సు, ఇంద్రియములు, శరీరము మొదలైనవి ఒకదానినుండి మఱియొకటి క్రమముగ ఆజ్ఞలను స్వీకరించుచు, పైవాటి ఆదేశమును శిరసావహించుచు కలిసికట్టు తనముగ వ్యవహరించును. ఈ బుద్ధ్యాదులన్నిటికిని ప్రకాశమును అంద జేయునది ఆత్మ. జడములైన ఈ బుద్ధ్యాదులన్నియు ఆత్మసాన్నిధ్యముచే

ప్రకాశవంతములై, చైతన్యయుక్తములై యలరారుచున్నవి జపాకుసుమ సాన్నిధ్య మందు స్ఫటికమణివలె.

ఈ దేహేంద్రియాదిరూప ఉపాధియందు ఆత్మకు అత్యంత సమీపమున ఉన్నది బుద్ధి. బుద్ధికి ఈవల ఉన్నది మనస్సు, మనస్సుకు ఈవలున్నది ఇంద్రియములు. ఇంద్రియములకు ఈవల ఉన్నది దేహము. బుద్ధి ఆత్మకు అతి సమీపమున ఉండుటవలన మహాశక్తివంతమై వెలయు చుండును. అది నిశ్చయాత్మకమైనది. మనస్సు సంకల్పాత్మకమైనది. అనగా మనస్సుయొక్క స్వభావము సంకల్పించుట. బుద్ధియొక్క స్వభావము నిశ్చయించుట. కాబట్టి ఈ ఉపాధియందు బుద్ధియే కార్యాకార్య వివేచన యొనర్చుచు ఏది చేయవలెనో, ఎట్లు చేయవలెనో నిర్ణయించుచుండును. దృష్టాంతమునకు –

ఒక గ్రామమున ఒక ఆధ్యాత్మిక మహాసభ జరుగుచుండెను. సాయంత్రము 6 గంటలు మొదలుకొని 8-30 గంటల వఱకు దాని నిర్ణీత సమయము. అందు వేలకొలది ప్రజలు ఆసీనులై వక్తలయొక్క ప్రవచనములను, సదుపదేశములను వినుచుండిరి. సరిగా 8 గంటలు అయినది. శ్రోతలలో ఒకనికి ఆకలి ప్రారంభమైనది. అపుడు అతని మనస్సు మెల్లగా బుద్ధితో ఇట్లనెను. 'ఇంటికి వెళ్ళుదుమా, భోజన సమయమైనది. ఆకలిగా ఉన్నది.' వెంటనే బుద్ధి దానిని ఈ ప్రకారముగ మందలించెను. 'ఓ మనస్సా! ఇంకొక అరగంటసేపు ఓర్చుకొని కూర్చుందుము! సభ పూర్తియగును. ఇటువంటి అవకాశము ఎల్లపుడు లభించునా? ఇట్టి మహానీయులు ఎపుడైన మన గ్రామమునకు విచ్చేయుదురా? ఎపుడున్న ఆకలియే ఎపుడున్న తిండియే. ఎపుడున్న సంసారమే కాబట్టి ఇంకొక్క అరగంట మెదలక కూర్చొనియుందుము.

దేవీ నవరాత్రులు

- శ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు

దేవీ నవరాత్ర్యుత్సవాలు దక్షిణ భారతదేశంలోనూ, బెంగాల్ ప్రాంతమందును విశేషంగా చేస్తారు. బెంగాల్ - కలకత్తాలో, కర్ణాటకలో, కన్యాకుమారి, విజయవాడలందు ఈ ఉత్సవాన్ని ఘనంగా చేస్తారు. దేవీ ఉపాసకులకు ఈ నవరాత్ర్యుత్సవాలు విశిష్టమైన పండుగ.

ఈ ఉత్సవాలు ఆశ్వయుజ శుద్ధపాడ్యమినాడు ప్రారంభమై నవమినాడుతో పూర్తవుతాయి. ఆ మరురోజు విజయదశమి. ఆశ్వయుజ శుక్లపక్షంలో ఏ రోజు పాడ్యమి ఆరు ఘడియలకు తక్కువగాకుండా వుంటుందో ఆ రోజున ఈ పూజను ప్రారంభించాలి. ఒకవేళ ఆరు ఘడియలు లేకుండా వుంటే కనీసం రెండు ఘడియలైనా ఆ రోజున పాడ్యమి వుండాలి. అమావాస్య ఘడియలతో కూడిన పాడ్యమివుంటే ఆ రోజు నవరాత్రి పూజ ప్రారంభించరాదు. అట్లే ఆ రోజు చిత్త నక్షత్రం, వైధృతియోగం వున్నా ఆ రోజు నవరాత్రుల ఉత్సవాన్ని ప్రారంభించరాదు. కానీ ధర్మసిన్ధువులో నియమాన్ని మధ్యాహ్నం వరకే అనీ, మధ్యాహ్నం వరకు చిత్త, వైధృతియోగం వుంటే ఆ అపరాహ్నంలోగాని, ఆ రాత్రిగాని ఈ నవరాత్రుల పూజను ప్రారంభించక మధ్యాహ్నమే ప్రారంభించాలి అని చెప్పబడింది.

విధివిధానము:- ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నాడు ప్రాతఃకాలంలోనే అభ్యంగన స్నానం చేసి ఈ నవరాత్రులలో ఏయే నియమాలను పాటించ దలంచారో వానిని సంకల్పంలో చెప్పి పూజను ప్రారంభించాలి. మీ ఆచార ప్రకారం బ్రాహ్మణుని ద్వారా గాని, లేక తానే సంధ్యావందనాదులను

పూర్తి చేసుకొని వచ్చి మట్టితో కట్టిన వేదికపైన ధాన్యంపోసి దానిపైన కలశస్థాపన చేయాలి. కలశానికి పైన దేవియొక్క ప్రతిమను స్థాపించి దానిని పూజించాలి. దుర్గాసప్తశతి పారాయణ చేసేవారు స్వయంగాగాని, బ్రాహ్మణుని ద్వారా గాని ఈ తొమ్మిది రోజులు సప్తశతి పారాయణ చేయాలి. అఖండ దీపారాధన చేసి ఆ తొమ్మిది రోజులు దీపం ఆరకుండా వుంచాలి.

ఆశ్వయుజ మాసంలో సూర్యుడు సరిగ్గా తూర్పు దిక్కులోనే వుంటాడు. ఈరోజులలో రాత్రింబవళ్ళు సమానంగా వుంటాయి. 'సమరాత్రిన్దినే కాలే విషువద్విషువంచీ తత్" అని అమరకోశంలో చెప్పినట్లు ఆ కాలాన్ని విషువత్ అంటారు. ఈ విషువత్కాలంలోని శుక్ల పక్షారంభ దినాలు తొమ్మిది శక్తిపూజకు ప్రధానమైనవిగా భావింపబడుతూన్నవి. కాబట్టి ఆశ్వయుజ శుక్ల పాడ్యమి నుండి తొమ్మిది రోజులు విషువత్కాలంలోని రాత్రులు. ఈ కాలం దేవీపూజకు విశిష్టమైనదిగా వుంది. ఈ దేవీ నవరాత్రులు జరుపువారు తొమ్మిది రోజులు పూజచేసి పదవరోజున ఉద్వాసన చేయాలి. దేవి ప్రతిమను పూజా పుష్పాలతోటి జలధిలో కలపాలి.

దుర్గాదేవి మహత్తర శక్తికి ప్రతీక. శక్తి లేనిదే ప్రపంచంలో ఏ పనీ జరుగదు గదా! కాబట్టి అట్టి శక్తి సంపాదనకోసరం ఈ తొమ్మిది రోజులు - నవరాత్రులు దుర్గాపూజను చేస్తున్నారు. దుర్గాదేవి సింహంపై కూర్చొని చేతిలో శూలాన్ని ధరించి దుష్టశక్తులను సంహరించి తన అష్టభుజాలతో అష్టదిక్కులను కాపాడుతుంది. ఈ దేవీ పూజలో దుర్గాదేవి పూజయే గాక చదువుల తల్లి సరస్వతి దేవి పూజ సప్తమి నాడు, సిరిసంపదలకు అధిదేవత అయిన లక్ష్మీదేవి పూజ నవమి రోజున చేస్తారు.

ఈ దేవీ నవరాత్రుల పూజలను వర్ణవ్యవస్థను పాటించకుండా అందరూ చేస్తారు. బెంగాల్‌లో ఈ దేవీ పూజలకు చాల ప్రాముఖ్యత

వుంది. కలకత్తాలో ఈ పూజలను చాలా గొప్పగా చేస్తారు. బుఱ్ఱా బజారులోని సింహవాహిని దుర్గామల్లిక్ వంశం వారిచే అష్టధాతు మిశ్రితలోహమూర్తికి పూజ చేయబడుతుంది.

దేవియొక్క అష్టాదశ శక్తిపీఠాలు భారతదేశమంతటా వున్నవి. ఆయా శక్తి పీఠాలలో ఈ నవరాత్రి పూజలను విశేషంగా చేస్తారు. ఈ పూజలను తొమ్మిది రోజులు జరుపలేని వారు సప్తమి, అష్టమి, నవమి మూడు రోజులు చేస్తారు. “తిథితత్త్వం”అనే గ్రంథంలో ఈ దుర్గాదేవి పూజాకాలం ఏడు విధాలుగా చెప్పబడింది. ఈ పూజా విధానము ‘నవరాత్రి ప్రదీపం, దుర్గాపూజార్చన పద్ధతి’, ‘దుర్గాభక్తి తరంగిణి’,‘దుర్గాపూజా ప్రయోగం దీపిక’ అను గ్రంథాలలో విశదంగా వుంది. మార్కండేయ పురాణంలో త్రిమూర్తులు అగ్ని మొదలగువారి తేజస్సు ఒకటిగా కలసి దేవిగా అవతరించిందని చెప్పబడింది. ఆ దేవి శివుని శూలాన్ని, విష్ణువు యొక్క చక్రాన్ని, ఇన్ద్రుని వజ్రాయుధాన్ని చేతబట్టి మహిషాసురుని మర్ధించినదని, అట్లే శంభునిశంభ్వాదులను మట్టుబెట్టి చండముండాదులను చండాడినదని తెలుపబడింది. స్కంద పురాణంలో ఆశ్వయుజ మాసంలో చండిక సత్త్వరజస్తమో రూపంలో సరస్వతి, లక్ష్మి, దుర్గాదేవీలుగా ఆరాధింపబడుతున్నట్లు వివరింపబడి వుంది. ఇట్టి దేవీ నవరాత్రులను జరుపుకొని దేవీ అనుగ్రహంతో దేశమంతా శక్తిప్రపూర్ణమై ఆనందంతో విరాజిల్లుదుముగాక!

మనో నైర్మల్యము కావలయునా! నిష్కామ కర్మయోగము నభ్యసించుము. భగవద్భక్తి గలుగ వలయునా! ఈశ్వరసేవ చేయుము. చిత్త నిశ్చలత్వము కావలయునా! ప్రాణ సంయమ పరమగు హంసయోగమును శీలింపుము. మోక్షము గావలయునా! జ్ఞానయోగము నభ్యసింపుము. **– శ్రీ సద్గురు మలయాళస్వాములవారు**

ధ్యానము

– స్వామి బ్రహ్మానంద

(శ్రీరామకృష్ణమఠముల ప్రథమాధ్యక్షులు)

ప్రారంభావస్థలో ధ్యానము మనస్సుతో పోరుసల్పుట వంటిది. ప్రయత్న పూర్వకముగ చపల చిత్తమును నిగ్రహించి భగవత్పాదపద్మ సన్నిధిని ఉంచవలెను. కాని ప్రారంభ దశలో ధ్యాన సమయంలో మెదడుకు ఒత్తిడి కల్గింపకుండ జాగరూకత కల్గియుండుము. నెమ్మదిగ పురోగమింపుము. క్రమక్రమముగ ప్రయత్నమును తీవ్రం చేయుము. క్రమ సాధనచే ధ్యానము సుకరమగును.

ధ్యానమునకు కూర్చొనప్పుడు మనస్సు యొక్క ఉబలాటమును, కోర్కెలను స్వప్నప్రాయములుగ, మిథ్యాభూతముగా తలంచుము. అవి ఇక మనస్సుతో ఎన్నడూ సంగము నొందజాలవు. నిర్మలుడనని భావింపుము. క్రమముగా నీ మనస్సు నిర్మలమై యొప్పును.

ధ్యానమును సాగించునపుడు నీవు దివ్యజ్యోతిని కనుగొనవచ్చును. లేదా ప్రణవనాదమును వినవచ్చును. ఇట్టి దివ్యానుభూతులు అనేకం కలుగవచ్చును. కానీ నీవు వానిని లక్షింపరాదు. అవి నీవు సక్రమ మార్గంలో పోతున్నావని తెలుపుటయే వాని ప్రయోజనము. అన్యథా అవి నిష్ప్రయోజనములు.

నీవు ధ్యానంలో కూర్చుండునపుడు మొదట ఒకానొక దివ్యానంద (దేవతా) రూపమును గూర్చి చింతన చేయుము. అది నీ నాడులకు ఉపశాన్తిదాయకము. నీ ఇష్టదేవతా రూపాన్ని మందహాసంతో కూడినదిగా, ఆనందంతో నిండియున్నదానినిగా వున్నట్లు చింతన చేయుము.

ధ్యానమును హృదయ కేంద్రంలో, సహస్రారంలో ఈ రెండు కేంద్రములలో చేయవచ్చును. మొదట నీ హృదయ కమలమందు నీ

ఇష్టమూర్తిని ధ్యానింపుము. హృదయ కమలమనగా హృదయమునకు దగ్గఱగా వుండు ఆధ్యాత్మిక కేంద్రము.

క్రమము తప్పక ధ్యానమును కొనసాగింపుము. వేకువజాము ధ్యానమునకు మంచి సమయము. ధ్యానం తరువాత అధమ పక్షము ఒక అర గంటయైనను ప్రశాంతముగ కూర్చొనుము. ధ్యానమైన వెంటనే లోకాభి రామాయణంలోగాని, లౌకిక చింతలలోగాని కాలము గడపకుము. అది తగదు. అది మహాహానికరము గావచ్చును.

ప్రతిదినము జపధ్యానములకు రెండుగంటలైనా వినియోగింపుము. అమావాస్య, పూర్ణిమ మొదలగు పర్వదినములు సాధనకనుకూలములగు శుభదినములు. ఈ దినములలో జప -ధ్యానములకై మరింత సమయాన్ని వినియోగించుము.

వేకువజాము, మధ్యాహ్నము, సాయంకాలము, అర్ధరాత్రిలలో ధ్యానము చేయుము. ఇట్లు దినానికి నాల్గుసార్లు క్రమం తప్పక ధ్యానం చేయుము.

భగవత్తత్వాన్ని సాకారముగ గాని, నిరాకారముగగాని చింతించుటే ధ్యానము. ధ్యానమును మంత్రజపంతోబాటు ఒనర్చవలెను.

ధ్యానమున నీ ఇష్టదేవత ప్రకాశవంతమై యున్నట్లును, ఆ ప్రకాశం సర్వాన్ని ప్రకాశింప చేస్తునట్లును భావింపుము. ఇష్టదేవత సజీవముగా నున్నట్లు దలపవలెను. ఇట్లు ధ్యానిస్తూరాగా రాగా క్రమంగా రూపము అఖండమున లయించును. అపుడు పరమాత్మ సాన్నిధ్యం విస్పష్టంగా తోచును. మనస్సు లయమగును. నిర్వికల్ప సమాధి అనుభవము కల్గును.

ధ్యానమును ఏడెనిమిదేండ్లపాటు నిరంతరము అభ్యసించినచో నీ సాధన ఫలితాలను, శాంత్యానందములను పొందెదవు.

(బ్రహ్మానంద బోధల నుండి)

సాధన పంచకమ్

- శ్రీ సంపూర్ణానందగిరి స్వాములవారు

జహదజహల్లక్షణా : ఏకదేశ పరిత్యాగే సతి ఏకదేశ పరిగ్రహరూపా భాగత్యాగలక్షణా॥

అథవా: "యత్ర హి విశిష్ట వాచక శబ్దః ఏకదేశే విహాయ ఏకదేశే వర్తతే తత్ర జహదజహల్లక్షణా॥ "

అథవా: "శక్యతావచ్ఛేదక పరిత్యాగేన వ్యక్తి మాత్ర బోధ ప్రయోజికా జహదజహల్లక్షణా॥" జహదజహత్తనగా విడిచి విడువనిదని యర్థము.

వాచ్యార్థమునందునొక భాగమును వదిలి ఒక భాగమును స్వీకరించునది జహదజహల్లక్షణయనబడును. అనగా వాచ్యార్థముయొక్క ఒక భాగమును వదిలి మఱియొక భాగమును బోధించునదియని భావము. దీనికే భాగత్యాగ లక్షణయని "సో உ యందేవ దత్తః" యనునది దీనికుదాహరణయగును. సః= అతడే, అయం=ఈ, దేవదత్తః = దేవదత్తుడు అని పదముల యొక్క యర్థము.

బృహస్పతి (గురువు) మేషాది 12 రాశుల భ్రమణంలో ఒక రాశి నుండి వేరొక రాశిలో ప్రవేశించినపుడు ఒక్కొక్క నదికి పుష్కరమగును. కన్యారాశిలో ప్రవేశించినపుడు కృష్ణానదికి పుష్కరాలు జరుగును. ఆ పుష్కర 12 దినములలో స్నాన జపధ్యానాల వలన అధిక పుణ్య ప్రాప్తి కలుగును. ఆ సమయంలో చిన్మయుడు, ఆనందమయుడనే ఇద్దరు (సమీపస్నం) స్నేహితులు స్నానార్థము విజయవాడ కృష్ణానది చేరి స్నానం చేసి ఒడ్డుకు చేరే సమయంలో సదాచార సంపన్నుడు 30ది ఏండ్ల ప్రాయం కలవాడైన

దేవదత్తుని వీరిరువురును జూసి సంతసించి పరస్పర సంభాషణచే వారితో పరస్పర స్నేహము బలపడెను. 12 దినములు పుష్కర సమాప్త్యనంతరము తమతమ త్రోవల వెడలిరి.

మేషరాశిలో బృహస్పతి ప్రవేశించినపుడు గంగానదికి పుష్కర విశేషముండును. ఆ సమయంలో చిన్మయుడు, ఆనందమయుడు కలసి పరమ పవిత్ర క్షేత్రమైన కాశికి వెళ్లిరి. కాశీ పట్టణమునకానుకొని వేగంగా నది ప్రవహించుచున్నది. ఈ గంగానదిలో వీరిరువురు స్నానము జేసి ఒడ్డునకు జేరి జపము చేయుటకు సిద్ధమగుచుండిరి. ఆ సమయంలో కొంత దూరమున గల దేవదత్తుని చూచిన చిన్మయుడు ఆనంద మయునితో "సోఽయం దేవదత్తః" అని పలికెను. మరియు ఏడు సంవత్సరముల ముందు (క్రిందట) విజయవాడ కృష్ణానది పుష్కరాల సమయంలో మనతో కలిసిన దేవదత్తుడితడేనని భావించి సమీపమునకు వెళ్లి దర్శించుకొని అతడే ఈతడని పరస్పరం సంభాషించుకొనిరి. ఇచ్చట విచారింపదగినది "సః' అనుతచ్ఛబ్దము పరోక్షము భూతకాలము దూరదేశమును బోధించును. 'అయం' అను ఇదం శబ్దము ప్రత్యక్షము, వర్తమానము, సమీపమునగు నర్థమును బోధించును. ఇందు దేశకాలముల భేదమునుగలదు. అనగా పూర్వము కనుపించిన దేవదత్తుడు ఆ విజయవాడ ప్రదేశం కృష్ణానది తీరము పరోక్షత్వము, భూతకాలము. అప్పటి వయస్సు 30 సంవత్సరములు. ప్రస్తుత దేవదత్తుడు ఈ కాశీ క్షేత్రము, గంగానదీ తీరము, వర్తమానము, ప్రత్యక్షము 37 సంవత్సరములగల దేవదత్తుని జూచి అతడే ఇతడనుట తగునా? ఎంతమాత్రము తగదు. కనుక దేవదత్తాఽభేదము సిద్ధింపదు. కనుక జహదజహల్లక్షణనే ఆశ్రయింపవలెను. ఈ లక్షణానుసారము 'జహద్' విడువదగినది అనగానేమి అని ప్రశ్నరాగా విరుద్ధ ధర్మములైనవి విడువవలెను. అవి

ఏమనగా విజయవాడ ప్రదేశ, కృష్ణానదీ తీరము పరోక్షత్వాది విశిష్ట దేవదత్తునితో, కాశీ క్షేత్ర గంగానదీ తీరము ప్రత్యక్షమును విడిచిపెట్టవలెను. అజహత్తనగా విడువనిది. ఏమనగా! రెండింటిలో దేవదత్తాంశ పిండమును మాత్రము గ్రహించవలెను. ఈవిధముగా గ్రహించినచో అ దేవదత్తుడే ఈ దేవ దత్తుడను నర్థము సిద్ధించును. ఇంతవరకు దృష్టాంతమును విశదీకరించు కొంటిమి.

ప్రస్తుతం దార్ష్టాంతికమందు పై తెలుపు దృష్టాంతాన్వయమును తెలిసికొందము.

"తత్త్వమసి"అను మహావాక్యమునందు 'తత్' పదమునకు పరోక్షత్వ సర్వజ్ఞత్వాది విశిష్ట చైతన్యము 'త్వమ్' పదమునకు ప్రత్యక్షత్వాల్పజ్ఞత్వాది విశిష్ట చైతన్యము, ఈరెండింటిలోను చైతన్యమునకు ఏకత్వము సంభవించినను పరోక్షత్వ, అపరోక్షత్వాదుల వైరుధ్యమున్నందు వలన ఏకత్వము కుదరదు. కనుక జహదజహల్లక్షణను స్వీకరించి, తత్పద వాచ్యార్థములోనున్న పరోక్షత్వ సర్వజ్ఞత్వాదులను, త్వంపద వాచ్యార్థములో నున్న ప్రత్యక్షత్వాల్పజ్ఞత్వాదులను వదలి, రెండింటిలో నున్న చైతన్యాంశ మాత్రమును గ్రహించిన అది నీవైయున్నావని యర్థము సిద్ధమగును. అనగా చీమ మొదలుకొని చతుర్ముఖ బ్రహ్మదేవుని పర్యన్తము వ్యాపక, సమస్త దేహములలోను ఏ చైతన్యము కలదో, ఆ చైతన్యము నీవే అయివున్నావు. ఇందులోనిసుమంతయును సందేహము లేదు అని సద్గురువు ఉత్తమ శిష్యునకుపదేశము చేయును. కావున నిది ఉపదేశవాక్యమని ప్రతీతి చెందినది. ఈ విషయమును సమగ్రంగా శిష్యుడు గ్రహించి శ్రీ గురుదేవుల వాక్యమునందు విశ్వాస ముంచవలెను. ఈ విధముగా జ్ఞాని ఈ సమస్త జగత్తు బ్రహ్మము కంటె భిన్నముకాదని, చరాచరాత్మకమగు

ప్రపంచ మంతయు బ్రహ్మస్వరూపమే యని శాస్త్రాచార్యుల ద్వారా నిశ్చయించి తదుపరి స్వయముగా స్వానుభవము నొంది ముక్తుడగుచున్నాడు. ముందుజెప్పిన ప్రకారము వాగాది యింద్రియము లన్నియును అధిష్ఠానమైన బ్రహ్మములో లయము జెందినను పునర్జన్మను పొందడు.

అజ్ఞాని అసత్యమైన దేహాదుల యందాత్మబుద్ధి గలవాడు. ఈ సమస్త జగత్తునకు పరబ్రహ్మమే కారణమని, అధిష్ఠానమని తెలియనివాడు ఈ జగత్కారణ బ్రహ్మమే నా శరీరమునకు ఆధారమని యెరుగని యజ్ఞాని యొక్క వాగాదీన్ద్రియములు క్రమక్రమముగా మరణ సమయంలో పరబ్రహ్మ యందు లయమయినప్పటికి పూర్వకర్మానుసారముగా పునర్జన్మను పొందును. ప్రతి దినము సుషుప్తిలో లయమయి అవే వాసనలతో జాగ్రత్‌కు వచ్చినట్లు ఈ సకల జగత్తంతయును అధిష్ఠాన బ్రహ్మ స్వరూపముగానే గలిగియున్నది. ఆ బ్రహ్మ స్వరూపమే నిత్య శుద్ధ బుద్ధ ముక్త స్వరూపము గలది. ఓ శ్వేతకేతుడా! 'తత్ సర్వవ్యాపక సర్వాధిష్ఠాన యఖండయద్వితీయమైన యా (అ) పరబ్రహ్మమే, 'త్వం'=కర్తృత్యాది ధర్మములతో యుక్తమైన జీవాధిష్ఠానమైన నీవును, 'అసి'= అయితివి. సకల జగదాధార పరబ్రహ్మమే నీవై యున్నావు. ఇందులోనిసుమంతయును సందేహము లేదు. అని యుద్దాలక మహర్షి పుత్రుడైన శ్వేతకేతువునకు ఈ తత్త్వమసి మహా వాక్యమును సుస్పష్టముగా బోధించెను. తొమ్మిది పర్యాయములు తత్త్వమసి మహావాక్యమును దృష్టాంతముల ద్వారా తండ్రియొక్క యనుగ్రహముచే శ్రవణము చేసి మననాదుల ద్వారా జీవబ్రహ్మలకు భేదము లేదు. జీవుడే పరమాత్మ, పరమాత్మయే జీవుడు. ఉపాధి భేదమువలన జీవ సంజ్ఞలు గలిగిన రెండింటికి యధిష్ఠానము ఒకటే యని యభేద జ్ఞానమును పొందినవాడై బ్రహ్మము నందు స్వాత్మజ్ఞానముచే (తన యొక్క అజ్ఞానముచే) ఆరోపింపబడిన కర్తృత్వాది రూపమును తొలగించబడినవాడై "అహం

బ్రహ్మాస్మి, బ్రహ్మైవాహమస్మి" 'నేను బ్రహ్మమును, బ్రహ్మమే నేను' అను దృఢాపరోక్ష జ్ఞానమును బొంది యానంద స్వరూపుడై శ్వేతకేతుడు జీవన్ముక్తుడయ్యెను.

తత్త్వమసి మహావాక్యోపదేశమును శ్రవణమనననిధి ధ్యాసలతో కూడియుండు వారికి కలుగు ప్రయోజనములు.

1. మరణము వలన భయపడరు.
2. నాకు మరణము లేదను విజ్ఞానము కలిగియుందురు.
3. శీతోష్ణాది ద్వన్ద్వాతీతుడగును. ద్వంద్వములు సంభవించినపుడు వికారము నొందరు.
4. అందరి యందు సమాన భావము గలిగియుందురు.
5. పశుపక్ష్యాదులయందును, మానవులయందును, దేవతల యందును, చతుర్ముఖ బ్రహ్మయందును సమాన దృష్టి గలిగి యుందురు.
6. అహంకార, మమకార, రాగద్వేష ఈర్ష్యాసుయాదులు, కామక్రోధాది దోషములు లేని వారగుదురు.
7. పునర్జన్మ లేని వారగుదురు, జీవన్ముక్తులగుదురు.
8. సదా సంతోషమును బొందుదురు.
9. అపారమైన బ్రహ్మానందము ననుభవించుచుందురు.
10. లోక క్షేమమునే కాంక్షించువారై యుందురు.

గమనిక : వేదాన్తభేరి జీవిత చందాదారులకు '<u>ఎల్</u>' గుర్తు గల వారికి ఈ డిశంబరు నెలతో పత్రిక ఆపివేయబడును.

మనస్సు

- శ్రీ సర్వాత్మానందగిరి స్వాములవారు

మనిషి శరీరము, అదేవిధంగా సకల ప్రాణి శరీరాలు కూడా, రెండు భాగాలతో కూడి వున్నాయి. ఒకటి -కంటికి కనబడే రక్తమాంసాది సప్తధాతుమయ శరీరము. రెండవది - కంటికి కనబడనటువంటిదీ, శరీరము లోపల గలదీ ఐన సూక్ష్మ శరీరము. మనము నిత్యము ఉపయోగించుకునే సెల్‌ఫోనులు, గడియారాలు, మిక్సీలు, ఫ్యానులు, వాహననాలు ఇత్యాదుల మాదిరి అన్నమాట. ఈ ఉపకరణాలలో గూడా కంటికి కనబడుతూ ఉపయోగపడే భాగము ఇంకా దానిలోపల వుండి దాన్ని పనిచేయించే యంత్రము. యంత్రము వల్లనే గదా ఉపకరణము తన పనులను చెయ్యగలుగుతుంది! అదేవిధంగా సూక్ష్మ శరీరమనే యంత్రము వల్లనే శరీరము అన్ని పనులనూ చెయ్యగలుగుతున్నది.

యంత్రాలలో అనేక భాగాలు ఉన్నట్టే సూక్ష్మ శరీరములో గూడా ఇరవై నాలుగు భాగాలున్నాయి. వాటిలో ప్రధానమైన భాగమే అందరికీ ప్రసిద్ధంగా తెలిసిన మనస్సు. మనశ్శాంతి, మనోవేదన, మనో వ్యాధి, మనోరంజనము మొదలైన శబ్దాలు అందరికి తెలిసినవే. మనస్సు అనే శబ్దాని కన్నా అంతఃకరణము అనే శబ్దము ఎక్కువ అర్థవంతమైనది. అంతఃకరణము ఒక్కటే ఐనాగూడా అది నాలుగు విధాలైన పనులను చేస్తుంది. అది చేసే పనులను బట్టి దానికి నాలుగు పేర్లు కలిగాయి. మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారము అన్నవే ఆ పేర్లు శరీరము చేసే సకల కార్యకలాపానికీ అంతఃకరణమే మూలము. అంతఃకరణానికీ హృదయము అని మరొక పేరు.

హృదయము శరీరములో ఎక్కడ వున్నది? "పద్మకోశ ప్రతీకాశగ్ం హృదయం చా ప్యధోముఖం." (హృదయ మనేది నాభికి జానెడు ఎత్తున ఛాతి మధ్యభాగంలో తలక్రిందులుగా వున్న తామరమొగ్గ ఆకారంలో వున్నది) అని శ్రుతి చెబుతున్నది. హృదయము అంటే రక్తాన్ని శుద్ధి చేసి శరీరమంతటికి పంపించే గుండెకాయ అని పొరబాటు పడకూడదు. వెంట్రుక కొనలో వందభాగమంత దాని పరిమాణము (సైజు). ఇది సత్త్వగుణ ప్రధానమైనందున స్థూలమైన ఎటువంటి సూక్ష్మదర్శిని(Micro scope) ద్వారా కూడా ఇది దర్శించబడదు. ఇంత అతి సూక్ష్మమైన అంతఃకరణంలో కోట్లాది జన్మలలో జీవి అనుభవించిన అనేక విషయ భోగాల స్మృతులు (వాసనలు) అంటే శబ్ద స్పర్శరూప రుచిగంధాలకు సంబంధించిన ఇష్టాయిష్టాల వాసనలు నిలవ చెయ్యబడి వుంటాయి. వీటిని అనుసరించే వ్యక్తి స్వభావము ఏర్పడుతుంది. ఈ అంతఃకరణాన్నే మనసు అని సామాన్యులు అంటుంటారు.

అంతఃకరణము ఏవిధంగా ఏర్పడింది?- పరమాత్మ యొక్క శక్తి ఐన ప్రకృతిలోగల త్రిగుణాలవలన మహత్తు, అహంకారము, పంచభూతాలు, ఒకదాని నుండి మరొకటి క్రమంగా ఏర్పడినాయి.. పంచభూతాల మిశ్రమము (సమష్టి పంచభూతాలు) సత్త్వగుణము అనే రెంటికీ, అదనంగా వాయువు కలయికతో మనసు అదనపు అగ్ని కలయితో బుద్ధి, అదనపు జలము కలయికతో చిత్తము, అదనపు పృథ్వి కలయికతో అహంకారము ఏర్పడినాయి. ఇక ఈ నాలిగింటి వృత్తులను పరిశీలిద్దాము.

మనస్సు - దీని వృత్తులు సంకల్ప, వికల్పములు. వికల్పము అంటే ప్రపంచమనేది ఒకటి వున్నది. దానిలో కోట్లకొలది భోగ్యవిషయా లున్నాయి అనే భావన. సంకల్పము అంటే ఆ విషయాల ప్రాప్తికి గురించిన వివరాలు-ఫలాని వస్తువు ఎక్కడ లభిస్తుంది? ఎప్పుడు లభిస్తుంది? ఏ విధంగా లభిస్తుంది? చెయ్యవలసిన ప్రయత్న మేమిటి? ఇత్యాది వివరాలను తయారు చెయ్యడము.

బుద్ధి – విషయాన్ని గుర్తించడము అంటే ఫలానిది అని నిశ్చయించడము దీని వృత్తి. ఫలాని మనిషి, ఫలాని చోటు, ఫలాని వస్తువు, ఫలాని సమయము, ఫలాని శబ్దము, స్పర్శ, రూపము, రుచి, గంధము అని నిశ్చయించడము బుద్ధి పని.

చిత్తము – అనుభవించిన ఇష్టాయిష్ట విషయాల స్మృతులను నిలవ చెయ్యడము చిత్తము పని. చిత్తములో గల విషయ వివరాలను అనుసరించే బుద్ధి తనకు తటస్థపడే విషయాలను నిశ్చయించగలుగుతుంది. చిత్తములో లేని వాటిని గురించి అది ఎటువంటి నిశ్చయాన్ని చెయ్యలేదు.

అహంకారము – శరీర వ్యవస్థ అంతటికీ యజమాని అహంకారము. "నేను" అనే శబ్దంతో అహంకారము వ్యక్తమౌతుంది. ఇంద్రియాలను, శరీరాన్ని సకల కార్యాలను చేయించేదీ, ఆ కార్యాల ఫలితాలను అనుభవించేదీ ఈ అహంకారమే, అంటే కర్తృత్వ భోక్తృత్వాలనే వృత్తులు రెండూ అహంకారానివి.

కోరికలు పుట్టేవి అహంకారానికే. ఒక కోరిక కలగగానే దాన్ని పూర్తి చేసుకోవడానికి మనసు, బుద్ధి,చిత్తాలను, ఇంద్రియాలను, వాటిద్వారా శరీరాన్ని ప్రేరేపించి లోకంలో కర్మను చేయిస్తుంది. ఎంత చిన్న కోరిక ఐనాగూడా వీటన్నిటి అన్యోన్య సహాయం చేతనే పూర్తి చేసుకుని ఫలితాన్ని అనుభవిస్తుంది. అహంకారము, అంటే కర్తగా, భోక్తగా ప్రవర్తిస్తుంది. ఫలితం అనుకూలంగా వుంటే సంతోషిస్తుంది. ప్రతికూలంగా వుంటే దుఃఖిస్తుంది. తత్త్వజ్ఞానము లేని మనుష్యులందరూ అహంకారాన్నే తాముగా భావిస్తారు.

తనకు ఇష్టమైన విషయాలను మళ్ళీ మళ్ళీ అనుభవించాలనీ, అంతేగాకుండా జ్ఞానేంద్రియాలకు తటస్థపడుతున్న నూతన విషయాలను సంపాదించుకుని లోకంలో శాశ్వతంగా, సుఖంగా వుందామని నిరంతరము ప్రయత్నిస్తుంది అహంకారము. ఎన్ని సంపదలున్నా. దీనికి

ఇవి చాలు అనే తృప్తి ఎన్నడూ కలగదు. ఆ కారణంగానే అది కోట్లకొద్ది ఉచ్చనీచమైన జన్మల నెత్తుతుంటుంది. నేను పండితుడిని, ధనవంతుడిని, బలవంతుడిని, రోగిని, అధికారిని అనే ఇత్యాది భావాలన్నీ అహంకారానివే.

చిత్తంలోకి అవగుణాలను, సద్గుణాలను చేర్చుకునేది అహంకారమే. అసూయ ద్వేషాది దుర్గుణాల వలన ఇతరులకు కీడు చెయ్యాలనీ, ఇతరుల ధనసంపదలను తన వశం చేసుకోవాలనీ, అనేక వక్రమార్గాలలో ప్రవర్తిస్తూ సుఖశాంతులను కోల్పోయి అధోగతిలో పడేది కూడా అహంకారమే. భారతేతిహాసంలోని దుర్యోధనుడు, పౌరాణికులైన రావణాది అసురులందరూ దీనికి నిదర్శనము.

"అహమాత్మా గుడాకేశ సర్వభూతాశయ స్థితః" అన్న శ్రీమద్భగవద్గీతా వాక్యంలో సకల ప్రాణుల హృదయాలలో నేనున్నాను అని భగవానుడు తెలిపాడు. పరమాత్మ కర్తృత్వ భోక్తృత్వరహితుడు, దోషరహితుడు, ఆనందస్వరూపుడు. ఐనాగూడా జీవి దుష్టమార్గంలో పడిపోయి ఎందుకు సంసారంలో తిరుగుతున్నాడు? పరమాత్మ చైతన్య స్వరూపుడు. ఆయన ఆధారము వల్లనే అంతఃకరణము తన కార్యకలాపాన్ని చెయ్యగలుగుతున్నది. అంతఃకరణ స్వభావంతో దానిలోపల గల పరమాత్మకు ఎటువంటి సంబంధమూ లేదు. జ్ఞానుల సాంగత్యంతో వారి తత్త్వబోధను గ్రహించి, పట్టుదలతో సాధనను చేసి ఎప్పుడైతే వ్యక్తి తాను అహంకారమనే కృత్రిమమైన నేను కాను, దానికి లోపల వుండి దాన్ని చైతన్యవంతం చేస్తున్న పరమాత్మనే నేను, అని గ్రహిస్తాడో అప్పుడే అతడు ఆభాసమాత్రమైన ప్రాపంచిక విషయానందాలకు ప్రాకులాడక, వాటినుండి ముక్తుడై తన స్వరూపానందంలో శాశ్వతంగా నిలిచి పోగలడు.

ఓం తత్ సత్

దవనం కథ

– సేకరణ : ఆచార్య కె. సర్వోత్తమరావు, (తిరుపతి)

ఆకులన్నిటికి 'వాసన' సహజం. కాని 'దవనం' వాసన మాత్రం వేరు. చిన్న చిన్న ఆకులు. సుగంధ పత్రం. ఎందుకని అడిగితే తెలిసినవారు ఒక కథ చెబుతారు. ఆ కథను విందామా!

జగన్నాథ క్షేత్రంలో పూరిలో దవనం పూజకే ప్రాధాన్యం.

పూరికి రాజు సాత్యకి సత్పురుషుడు. రోజూ నిరాడంబరంగా గుడికి వెళ్ళి దర్శనం చేసుకొనేవాడు. అలాగే ఒక రోజు వెళ్ళాడు.

గుడిలో పూజలు జరుగుతున్నాయి. రాజు అలా ప్రదక్షిణలు చేస్తూ వస్తున్నాడు. ఒకచోట ఒక మంటపంలో నలుగురు జూదం ఆడుతున్నారు. వారు రాజును చూడలేదు. రాజుతో వచ్చిన పరిజనం వారిని మందలించాలనుకున్నారు. రాజు వారిని వారించాడు. తానూ మంటపంలో కూర్చున్నాడు. ఆట చూస్తున్నాడు. ఈలోగా ఆటలాడే వారిలో ఒకడు పని ఉందని వెళ్ళిపోయాడు. అక్కడివారు రాజును చూచి ఎవడో అనుకుని ఆట వచ్చా అన్నారు. రాజు తల వూపాడు. ఇంకేం తానూ వారిలో ఒకడయ్యాడు. ఆట పసందుగా ఉంది. రాజు తానెందుకు అక్కడికి వచ్చానో మరచిపోయాడు. పురోహితులు పూజ అయిందని అంటున్నా పట్టించుకోలేదు. చివరకు అర్చకులు హారతి తట్టతో వచ్చారు.

రాజు చేత్తో దాయం వేస్తూ మరో చేతితో హారతిపై చేయి చాచాడు. అర్చకులు ఆశ్చర్యపడి వెళ్ళిపోయారు. కాసేపటికి రాజు ఆట చాలించాడు. ఆపై పూజలింకా కాలేదా అని అడిగాడు. అర్చకులు అసలు సంగతి చెప్పారు. రాజు చాల బాధపడ్డాడు. స్వామి హారతికి ఎడమ చేయి చాచడమా! ఎంత పాపం ఎంత పాపం అనుకున్నాడు.

తన తప్పుకు రాజు ప్రాయశ్చిత్తం చేసుకోవాలనుకున్నాడు. మంత్రిని రమ్మన్నాడు.

'మంత్రీ! రోజూ రాత్రిపూట ఒక చేయి కనిపిస్తున్నది. ఆ చేయిని నరికేయ్' అన్నాడు.

మంత్రి సరేనన్నాడు. రాత్రి వేళ చేయి కనబడింది. మంత్రి చేయి నరికేశాడు. హా జగన్నాథా హా జగన్నాథా అని ఎవరో అరచినట్లనిపించింది. తీరా చూస్తే రాజుగారు. రాజుగారి చేతిని నరికేశానా అని బాధపడ్డాడు మంత్రి. రాజు ఓదార్చాడు.

మరుసటి రోజు మంత్రి, రాజు గుడికి బయలుదేరారు. ఒక తాంబాళంలో నరికిన చేయి.

గుడికి చేరారు. అర్చకులు హారతి పట్టారు. హారతితో రాజు దగ్గరికి వచ్చారు. రాజు యథాప్రకారం చేయి చాచాడు. ఎడమ చేయి వచ్చేసింది. తాంబాళంలో ఒక పత్రం. అదే దవనం. రాజు తోటలో దవనం నాటమన్నాడు. అప్పటి నుండి పూరి జగన్నాథస్వామికి 'దవనం' పూజ. దవనం రాజు నిజమయిన భక్తికి ప్రతీక. అందుకే దానికి అంత సుగంధం

గమనిక : వేదాన్తభేరికి జీవితచందా రూ.600/-లు ఇదివరలో కట్టియున్న వారికి 2020 డిశంబరుతో పూర్తి యగును. కావట్టివారు మరల రూ.1500/- (పదిహేను వందల రూపాయలను) "వేదాన్తభేరి శాశ్వత నిధి" అను పేరిట పంపినచో వారికి పత్రిక వున్నంతవరకు పత్రిక పంపబడును. వారు మరల చందా పంపబనిలేదు.

ధర్మ జీవనమంటే ఇచ్చిపుచ్చుకొని జీవించుట

- శ్రీ ప్రణవాత్మానంద సరస్వతి స్వాములవారు

వ్యక్తి, సమాజము, ప్రకృతి కలసి సృష్టి. పై మూడింటి పరస్పర సంబంధాలు సృష్టికార్యం. మన అవగాహన కొరకు పై మూడు పేర్లతో వ్యవహరిస్తాం. ఈ విషయం స్పష్టంగా అర్థమైతే ధార్మికంగా జీవిస్తూ శాంతి ప్రస్థానం చేయగలము.

ప్రకృతికనుకూలంగా సమాజము, సమాజానికనుకూలంగా వ్యక్తులు అర్థం చేసుకొని జీవించాలి. ఎందుకంటే సమాజం లేకుండా వ్యక్తికి వ్యక్తిత్వం లేదు. అదేవిధంగా ప్రకృతి లేకుండా సమాజం వుండదు. అన్ని ప్రాణులు సహజంగానే జీవిస్తాయి. ఒక్క మనిషి మాత్రం స్వార్థపరుడై ప్రకృతిని పాడుచేస్తున్నాడు.

ప్రకృతి పర్యావరణాన్ని పరిరక్షించవలసిన బాధ్యత సమాజ రూపమైన మానవులదే. కావున వ్యక్తి,సమాజము, ప్రకృతి విడదీయ రాని సంబంధాలుగా అర్థం చేసుకొని సహకరించాలి. ఈ విషయాన్ని వ్యక్తి గ్రహిస్తే, అందరం అందరికొరకు కలిసి శాంతి జీవనం చేయగలము.

అన్ని ప్రాణులు ప్రకృతితో మమేకమై కలిసిపోయి గుట్టుమట్టుగా జీవిస్తున్నాయి. స్వార్థపరుడైన మనిషి మాత్రం ప్రకృతిని పాడు చేస్తున్నాడు. మనిషి మేధావిజ్ఞానజీవి. ఆలోచించి, అర్థం చేసుకొని నేతృత్వం వహించాలి.

పశుపక్ష్యాది జాతులన్నీ ఆహార, భయమైధునాదులతో సమాజ జీవనము చేస్తున్నాయి. అన్ని ప్రాణులు వ్యక్తి ధర్మాలతో జీవించాలి, సుఖంగా జీవించాలి, తనను తాను రక్షించుకుంటూ జీవించాలి, జీవిస్తున్నవి. ప్రకృతి కనుకూలంగానే జీవనం కొనసాగిస్తున్నవి. వాటికి సంబంధాలు సహజంగా వున్నాయి. కానీ బంధాలు పెట్టుకోక జీవిస్తున్నాయి. వాటి బంధాలు సహజం తాత్కాలికంగా వుంటాయి.

ఒక్క మనిషి మాత్రం విశేష జ్ఞానంతో, స్వార్థమమకారాలు సృష్టించుకొని, బంధాలు సృష్టించుకొని బాధలతో జీవనం సాగిస్తున్నాడు. ఆశ్చర్యంగా వున్నది కదా! ప్రకృతినీ, పర్యావరణాన్ని, తోటి ప్రాణులను స్వార్థంతో సర్వ నాశనానికి మూలకారణమైనాడు కదా !

'పరీక్ష్యలోకాన్‌కర్మచితాన్, నిర్వేదమాయాత్ బ్రాహ్మణః" అన్న ముండక శ్రుతి ప్రకారం అర్థకామాలు జీవిత పరమార్థాలు కావని గ్రహించి ధర్మజీవనాన్ని కొనసాగిస్తాడు. ధర్మ జీవనమంటే - ఇచ్చిపుచ్చుకొని జీవించుట The Spirit of coopration endeavaur.

వ్యక్తి బాల్య, కౌమార, యవ్వన, వార్ధక్యాల కనుకూలంగా, సమాజ సంబంధాలను, ధార్మిక సంబంధాలుగా భావించి జీవిస్తాడు. చివరకు పరమ పురుషార్థమైన మోక్షం కూడా పొందుతాడు.

'తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా' అన్నట్లు సద్గురువు నాశ్రయించి, సేవించి, వారిని సంతుష్టులనొనరించి సంశయ నివృత్తి చేసుకుంటాడు. జీవేశ్వర, ప్రకృతి సంబంధాలనర్థం చేసుకొని గురువు అందించిన జ్ఞానంతో జీవిస్తాడు.

దృశ్యం నశ్యం, ద్రష్ట సత్యం అనే వాస్తవాన్ని స్వీకరించి, నిరంతర శ్రవణం చేస్తూ వాస్తవాన్ని గ్రహించి మనన నిధి ధ్యాసనలతో ఆత్మ పరమాత్మ కంటే భిన్నం కాదని గ్రహిస్తాడు.

'ఆత్మౌపమ్యేన సర్వత్ర సమంపశ్యతి యోర్జునా సుఖంవా యదివా దుఃఖం సయోగీ' అన్నట్లు సర్వుల కొరకు జీవిస్తూ, పాము కుబుసం విడిచినట్లు, దేహాభిమానం విడిచి జీవన్ముక్తుడై ప్రకాశిస్తాడు. తను సచ్చిదానంద స్వరూపుడై చరిస్తాడు. **" హరిః ఓమ్"**

భాగవతం షష్ఠ స్కంధము

-శ్రీ మాతా వరావిద్యానందగిరి స్వామిని

(జూలై సంచిక తరువాయి)

పరీక్షన్మహారాజు శుకమహర్షిని మహాత్మా! తమ శిష్యులైన దేవతలను వారికి గురువైన బృహస్పతి వదలి వెళ్ళిపోయెను. దేవతలు గురువు యెడల చేసిన అపచారము ఏమి? దీనిని గురించి తెలియ పరచండి అని అడిగెను. అందులకు శుకమహర్షి ఈవిధముగా చెప్పదొడగెను.

దేవేంద్రుడు ముల్లోకముల యందలి ఐశ్వర్యమును పొందినవాడై మదగర్వముతో మిడిసిపడుతూ సదాచారములను అతిక్రమించుచుండెను. "ధనమెచ్చిన మదమెచ్చును" అన్న నానుడి ఆతనియెడల నిజమయ్యెను. ఒకరోజు అతడు శచీదేవితో కూడి నిండు సభలో సింహాసనముపై ఆసీనుడై యుండెను. 49 మంది మరుద్గణములు, 8 మంది వసువులు, ఏకాదశ రుద్రులు, 12 మంది ఆదిత్యులు, ఋభుగణములు, విశ్వేదేవతలు, సాధ్యులు, అశ్వినీ దేవతలు ఆతనిని సేవించుచుండిరి. సిద్ధులు, చారణులు, గంధర్వులు, విద్యాధరులు, అప్సరసలు, కిన్నరులు, పక్షులు, నాగులు ఆతనిని సేవించుచూ స్తుతించుచుండిరి.

మధురమైన స్వరముతో వారందరూ ఇంద్రుని పొగడుచుండిరి. అతి సుందరమైన శ్వేతఛత్రము చంద్రమండలము వలె శోభిల్లుచుండెను. ఇతరములైన పార్షదులు వింజామరలు వీచుచుండిరి. ఆ సమయమున ఇంద్రాది దేవతలందరకు గురువైన బృహస్పతి సభకు ఏతెంచెను. ఇంద్రుడు ఆతనిని చూచి కూడా లేచి నమస్కరించలేదు. అది గమనించిన బృహస్పతి మౌనముగా అక్కడ నుండి ఇంటికి వెడలిపోయెను.

"స్ఖలనం హి మనుష్య ధర్మః" పొరపాటు పడటం మానవ సహజం.

కాని ఎవరైతే తన పొరపాటును వెంటనే గుర్తించగలుగుతారో వారు దేవతలే. దేవేంద్రుడు కూడా తన వలన జరిగిన పొరపాటును గుర్తించి తనను అతను నిండు సభలోనే నిందించుకొనసాగెను.

కో గృధ్యేత్ పండితో లక్ష్మీం త్రివిష్టపపతేరపి।

యయాహ మాసురం భావం నీతో ఽద్య విబుధేశ్వరః ॥

పండితులైన వారెవరూ స్వర్గరాజ్య సంపదలను పొందుటకు ఇష్ట పడరు. ఎందుకనగా ఈ సంపద కలిగించిన అసురభావమైన రజోగుణము వలన నేను బుద్ధిహీనుడనైతిని. సింహాసనముపై కూర్చొన్న చక్రవర్తి ఎవరు వచ్చినా సింహాసనమునుండి లేవకూడదని కొందరంటారు. కాని ఆ మాట ధర్మస్వరూపము నెరిగిన వారి మాట కాదు. ఇట్టివారు చెడ్డవారనే తలచవలెను.

తేషాం కుపథదేష్టౄణాం పతతాం తమసి వ్యాధః।

యే శ్రద్ధధ్యుర్వచస్తే వై మజ్జంత్యశ్మప్లవా ఇవ ॥

వీరు స్వయముగా నరకములో పడుదురు. వీరి మాటలను విశ్వసించినవారు రాతి పడవలో ఒడ్డుకు చేరవలెనని అనుకొనిన వానివలె నీటిలోనే పడిపోవుదురు. అనర్థమునే పొందుదురు. అని పరిపరి విధముల పశ్చాత్తాపపడిన ఇంద్రుడు తన గురువైన బృహస్పతి పాదములపై పడి క్షమాపణ వేడుకొనుటకు నిర్ణయించుకొన్నవాడై ఆతని కొఱకు తానే స్వయముగా వెదకెను. దేవతలచే కూడా వెతికించెను. కాని గురుదేవుని జాడ దొరకలేదు.

అవకాశము కొఱకు కాచుకొని వున్న అసురులు తమ గురువైన శుక్రాచార్యుని సహాయముతో దేవతలపై యుద్ధమునకు వచ్చి తీక్ష్ణమైన బాణములతో దేవతలను చంపనారంభించిరి. చేయునదేమి లేక దేవేంద్రుడు దేవతలతో సహా బ్రహ్మదేవుని శరణుజొచ్చెను. దేవతలయొక్క

కష్టమును జూచిన బ్రహ్మదేవుడు జాలిపొందినవాడై ఈ విధముగా పలికెను.

ఎంత గొప్ప సంపదలతో తులతూగుచున్ననూ మీరు చేసిన గొప్ప అపరాధమువలన మీకంటె బలహీనులైన వారి చేతిలో ఓడిపోతిరి. పూర్వము రాక్షసులు కూడా గురువును అవమానించి బలహీనులైనారు. వారు తమ తప్పు తెలిసికొని గురువును ఆరాధించి సంపదతో, బలముతో కూడుకొన్నవారైనారు. వారు తమ గురువుయొక్క ఆశీస్సులతో మీ స్వర్గలోకమునే కాదు నా సత్యలోకమును కూడా జయించగలుగుదురు.

న విప్రగోవింద గవీశ్వరాణాం భవంత్యభద్రాణి నరేశ్వరాణామ్ ॥

బ్రాహ్మణులను, గోవిందుని, గోవులను పూజించువారు ఎప్పటికీ అశుభములు పొందరు. మీ గురువైన బృహస్పతులవారు కనిపించుటలేదు. కనుక మీరు విప్రోత్తముడు, తపస్సంపన్నుడు, జితేంద్రియుడు అయిన త్వష్టకుమారుడగు విశ్వరూపుని ఆశ్రయించండి. అతని తల్లి అసుర కులమునకు చెందినది. కనుక అతనికి అసురులమీద ప్రేమ సహజంగా వుండును. కనుక మీరు అసురులను ప్రేమతో క్షమించి అతనిని గురువుగా ఆరాధించిన అతడు మీ కార్యమును నెరవేర్చును - అని. **(సశేషం).**

వేదాన్తభేరికి ఈక్రింది వారు పోషక చందా పంపినారు

1. సి.ఎస్.మూర్తి (కాకినాడ)	-	రూ. 1500/-
2. గున్నం కృష్ణమూర్తి (సహపురం)	-	రూ. 2000/-
3. బి.అనుజ్ఞరెడ్డి (వనపర్తి)	-	రూ. 2000/-
4. కంటిపూడి సోమరాజు (రాజమండ్రి) (రెండవమారు)	-	రూ. 2000/-
5. కె.ఎం.శాస్త్రి (హైద్రాబాద్)	-	రూ. 2000/-
6. జి.మనోహర్ (సికింద్రాబాద్)	-	రూ. 1000/-

అనన్య శివాచార్యులు అక్క మహాదేవి

కన్నడ దేశం తమిళనాడు వలె శివభక్తులకు నిలయం. అయితే కన్నడనాట శైవం ఈ నాటికి అత్యంత సుదృఢము. శివాచార్యులకు నిలయము. కర్ణాటక రాష్ట్రంలో షిమోగాకు దగ్గఱలో 'ఉడుతడి' అనే గ్రామం వుంది. ఆ గ్రామంలో అందరూ శైవారాధకులే. ఆ గ్రామంలోని నిర్మలశెట్టి కూడ శివభక్తుడే. అతని భార్య సుమతి. వీరు ఆదర్శ దంపతులు. నిత్య శివపూజ చేయనిదే మంచి నీరు కూడా తాగేవారు కారు. వారు సంతానం కోసం నిత్యం శివుణ్ణి ప్రార్థించేవారు. శివానుగ్రహంతో కొంత కాలానికి వారికి ఒక ఆడబిడ్డ పుట్టినది. ఆమెకు మహాదేవి అని నామ కరణం చేశారు. ఆమె చూడడానికి పార్వతీదేవి అంశతోనే పుట్టిందను కొనేవారు.

మహాదేవి అందరి పిల్లలవలె తోటి పిల్లలతో ఆడుకోడానికి ఇష్టపడేది కాదు. ఎప్పుడూ ఇంటిలోని పూజా మందిరంలో శివలింగం ముందు కూర్చొని అర్ధనిమీలిత నేత్రాలతో శివలింగం మీద దృష్టిని నిలిపి శివపంచాక్షరి మంత్రాన్ని జపిస్తూ వుండేది. తాను బాగా చదివి పండితురాలై శివుని గురించి గ్రంథాలను వ్రాయాలని, శివునిపై కృతులు వ్రాసి పాడాలని అనుకొనేది. అందుకుగాను తాను గురుకులంలో చేరాలని తల్లిదండ్రులను అడిగినది. కాని ఆనాడు ఆడపిల్లలను చదువనిచ్చేవారు కాదు. అంచేత వారు కుమార్తె పట్టుదలను చూచి తమ గ్రామ పొలిమేరలో గల 'గురువాడిమఠం' గురుకుల గురువుగారగు గురులింగ దేవునితో తన కూతురు మహాదేవి గురుకులంలో చేరి చదువుకోవాలని తపన పడుతున్నదని విన్నవించారు. అందుకు గురుకులాచార్యుడు గురులింగ

దేవుడు సమ్మతించి ఆమెను చూచి ఈమె కారణజన్మురాలు. కాబట్టి ఈమెకు నేను సకల విద్యలు నేర్పుతాను అని చెప్పి మహాదేవిని తన గురుకులంలో చేర్చుకున్నారు.

మహాదేవి ఏకసంతగ్రాహి. కాబట్టి అనతికాలంలోనే సకల శాస్త్రాలను చదివింది. సంస్కృత, కన్నడ భాషలలో పండితురాలయింది. ఆమె సహజంగా సౌందర్యరాశి. దానికి తగ్గట్లు ఇపుడు పండితురాలై సరస్వతీ కళతో గూడి మరింత శోభించింది.

గురుకులంలో విద్యాధ్యయనం పూర్తికాగానే తల్లిదండ్రులు ఆమెకు వివాహం చేయాలని నిశ్చయించి తగు వరుని వెదుకసాగారు. ఆమె వారి వివాహ ప్రస్తావనను తిరస్కరిస్తూ నేను పెళ్ళి చేసుకోను, ఒకవేళ అట్టి పరిస్థితి వస్తే నా ఆరాధ్య దేవుడు **మల్లికార్జున స్వామినే** పెళ్ళి చేసుకుంటాను- అంటూ తన స్థిర నిర్ణయాన్ని వారికి తెలిపింది.

తన కుమార్తెయొక్క ఈ వింత కోరికకు వారు విపరీతంగా బాధపడేవారు. కాని గురుకుల గురువు గారు శివయోగి మాత్రం 'మహాదేవి కారణజన్మురాలు. ఆమెను బలాత్కరించకండి అని వారికి ఓదార్పు చెప్పేవాడు. మహాదేవి మాత్రం రోజంతా శివపూజలు, శివధ్యానంతోనే కాలం గడుపుతూంది.

'ఉడుతడి' ప్రాంత రాజు కౌశికుడు ఒకనాడు తన సంచార సందర్భంలో మహాదేవిని చూచాడు. ఆమె అపురూప సౌందర్యానికి మోహితుడయ్యాడు. ఆమెను వివాహం చేసుకోవాలనుకొన్నాడు. ఏ రీతిగానైనా మహాదేవిని పెళ్ళాడాలని రాజు కౌశికుడు నిశ్చయానికి వచ్చాడు. ఆమె తల్లిదండ్రులకు కబురు పెట్టాడు.

విషయం తెలుసుకొనిన మహాదేవి ఆలోచించింది. రాజాజ్ఞను ధిక్కరించి రాజుబలం ముందు తల్లిదండ్రులు నిలువ లేరు. కాదంటే బాధలననుభవిస్తారు. కాబట్టి తన నిర్ణయాన్ని నేరుగా రాజుగారికే తానే చెప్పుతానని రాజసౌధం చేరింది. ఆమెను చూచిన రాజు సంబరపడిపోతాడు.

మహాదేవి రాజుతో "రాజా! మీ కోరిక మేరకు నేను మిమ్మల్ని పెళ్ళి చేసుకొంటాను. కానీ కొన్ని షరతులకు లోబడి. ఆ షరతులను మీరు ఉల్లఘించిన నాడు నేను రాజమందిరం నుండి వెళ్లిపోతాను. షరతులు 1). నేను నిత్య శివారాధన చేస్తాను. దానికి ఏలాంటి అవరోధాలు కలిగించరాదు. 2). నేను ప్రతిరోజు శివభక్తులకు ఆతిథ్యమిస్తాను. దాన్ని ఎవరూ అడ్డుకోరాదు. నా సాధనకు రాజభవనం పనికిరాదు. అందుచేత ఒక కుటీరాన్ని నా సాధనకనుకూలంగా నిర్మించి అందులోనే సాధన చేసుకుంటాను.

రాజు కౌశికుడందుకు సమ్మతించాడు. షరతులను పాటిస్తానన్నాడు. మహాదేవి కుటీరంలోకి వచ్చింది. ఆమె యొక్క శివారాధనలో రోజులు, వారాలు, మాసాలు గడచిపోతున్నాయి. ఒకరోజు శివపూజా ధురంధరుడైన మరుశ సిద్ధుడు, శివయోగి కలిసి మహాదేవి కుటీరానికి వచ్చారు. తన గురువగు శివయోగి సమక్షంలో మరళ సిద్ధులవారి వద్ద మహాదేవి శాశ్వత శివదీక్షను తీసుకొనినది. విరాగినిగా మారినది. ఈ విషయాన్ని తెలుసుకొనిన రాజు కౌశికునికి ఓర్పు నశించింది. ఒక అర్ధరాత్రి సమయంలో నడచుకొంటూ కుటీరానికి వచ్చి నిద్రిస్తున్న మహాదేవికి బలవంతంగా కౌగిలించుకోబోయాడు.

మహాదేవి రుద్రకాళి అయింది. మహారాజును దూరంగా నెట్టివేసింది. 'రాజా! నీవు నేను విధించిన షరతుల నుల్లంఘించావు. కాబట్టి నేనిపుడు

స్వతంత్రురాలిని అయ్యాను. నేనిపుడు సర్వసంగ పరిత్యాగినంటూ తన శరీరంపై గల వస్త్రాలు వదలివేసి తన పొడవైన తల కేశాలతో శరీరాన్ని కప్పుకొని కేశాంబరిగా మారి రాజమందిరాన్ని విడిచిపెట్టింది. అడవులు కొండలు దాటుకొంటూ కళ్యాణ పట్టణం చేరుకొన్నది. ఆ పట్టణంలో బసవేశ్వరుడు నిర్మించిన అనుభవమంటపం వుంది. రోజూ బసవేశ్వరుడు, అల్లమ ప్రభువు ఆ మంటపాన్ని దర్శించి కవులను, పండితులను గౌరవించేవారు.

కఠోర దీక్షతో ఐహిక బంధాలను ఛేదించి సదా ఆధ్యాత్మిక చింతనతో వీర విరాగిణి అయిన మహాదేవి ఆ అనుభవ మంటపంలో ప్రవేశించింది. కఠోరదీక్ష, విరాగిణి, ఆధ్యాత్మిక తేజస్సు, తొణికిసలాడే మహాదేవిని అల్లమ ప్రభువు, బసవేశ్వరుడు చూచి సాదరంగా ఆహ్వానించారు. అనుభవ మంటపంలో ఆశ్రయం కల్పించారు. అక్కడున్న శివభక్తులు మహాదేవిని అక్కా అని పిలిచేవారు. అప్పటి నుండి మహాదేవి అక్కమహాదేవిగా ప్రసిద్ధిని పొందింది. శివయోగి ద్వారా అక్కమహాదేవి మనస్సులోని అభిప్రాయాన్ని తెలుసుకొనిన బసవేశ్వరుడు మహాదేవిని శ్రీశైలం పంపాలని నిశ్చయించారు.

ఒకనాడు బసవేశ్వరుడు, అల్లమ ప్రభువు ఇద్దరు అక్క మహాదేవితో "అమ్మా! నీ కఠోరదీక్ష, నీ సాధన, మల్లికార్జునునిపై నీ వానినిగా చేసుకోవాలనే నీ ఆకాంక్ష, పరమేశ్వరునిలో లయమైపోవాలన్న నీ కోరిక, నీ తపస్సు ఫలించే సమయం సమీపించింది. నీ లక్ష్యసిద్ధికి అనువైన స్థలం శ్రీశైలం. అక్కడికి వెళ్లి ఆ గుహలలో నీ తపస్సును కొనసాగించు. అచటికి దగ్గరలోనే కదళీవనం వుంది. అది గొప్ప తపోభూమి. అచట ఎందరో ఋషీశ్వరులు తపస్సు చేసి సిద్ధిని పొందారు. అంచేత ఆ ప్రదేశాన్ని సిద్ధ స్థలమంటారు. నీవు అచటికి పోయి నీ తపస్సు ద్వారా సిద్ధిని పొందు"

అని ఆశీర్వదించి శ్రీశైలం దారిచూపడానికి దారి తెలిసిన కొందరు శివశరణులను కూడా పంపినారు.

అక్క మహాదేవి బసవేశ్వరుని అనుభవమంటపం నుండి నడచి అనేక ప్రయాసల కోర్చి శ్రీశైల క్షేత్రం చేరుకొనింది. శ్రీశైల మల్లికార్జునుని గురించి ఇప్పటి వరకు మనస్సులోనే ధ్యానిస్తున్న తాను నేడు తన కళ్ళారా చూడబోతూంది. స్వామివారి గర్భగుడిలోనికి పోయి అనిర్వచనీయ ఆనందానుభూతితో ఒళ్లు మరచిపోయింది. స్వామికెదురుగా అంజలి బద్ధురాలై నిలబడింది. కన్నార్పకుండా మల్లికార్జునుని చూస్తూ, ఒళ్లు వణకిపోతూంటే, ఆనందాశ్రువులు జలజల కళ్లనుండి ధారా ప్రవాహంగా కారుతూంటే "స్వామీ! ఇన్ని సంవత్సరాలుగా ఈ శరీరం నీ కోసమే వుంచుకొన్నాను. నీ దివ్యదర్శనం కోసరం నీ వున్నావని ధైర్యంతో లోకకట్టుబాట్లను ఎదిరించి నా భర్త మల్లికార్జునస్వామియే అని అందరికి చెప్పాను. శ్రీశైల మల్లికార్జునా! ఇక నీ దూరాన్ని భరించలేను, నన్ను నీ దానినిగా చేసుకో! నన్ను నీలో లయం చేసుకో!" అంటూ మనసారా ప్రార్థించింది. దాంతో అక్కమహాదేవి యొక్క మనస్సు కుదుట పడింది.

పాతాళగంగలో స్నానం చేసి, భ్రమరాంబను కూడ దర్శించి కదళీవనం చేరింది. అచటి గుహలో తపస్సు చేస్తూ కఠోరదీక్షతో కొన్ని రోజులు పళ్లు ఫలాలు తినింది. తరువాత కేవలం నీరు మాత్రం తాగి తపస్సు చేసింది. ఆ తరువాత కేవలం గాలిని మాత్రం తీసుకొని శ్రీశైలేసుని ధ్యానిస్తూంది. శరీరం శుష్కించిపోయింది. కళ్లు మాత్రం మల్లికార్జునుని రాకకోసరం ఎదురు చూస్తున్నాయి. కదళీవనంలో మల్లికార్జునుడు తిరుగుతున్నట్లు, తనతో మాట్లాడుతున్నట్లు, స్వామి తనను గుండెకు హత్తుకున్నట్లు సదా భావించేది

"తాను స్వామిలో ఐక్యమయ్యే సమయం సమీపించిందని" అక్క మహాదేవికి అనిపించసాగింది. తనను ఇప్పటి దాకా కంటికి రెప్పలాగా కాపాడిన మునెమ్మ, శ్రీశైలం తాను చేరడానికి సహకరించిన చెంచులు తన చుట్టూ వున్నారు. తాను చిన్నప్పటి నుండి అపురూపంగా పెంచుకొన్న చిలుక దీనంగా తనను చూస్తూంది.

అక్క మహాదేవి తను నిత్యం పూజించే శివునికి ఎదురుగా కూర్చొని శివపంచాక్షరి జపం చేస్తూంది. చేతిలో జపమాల తిరుగుతూంది. శివలింగం నుంచి మల్లికార్జునస్వామి కళ్యాణ బట్టలు ధరించి, పెండ్లి కొడుకు రూపంలో చేతిలో పూలహారం పట్టుకొని తన వద్దకు వస్తున్నట్లు తన కళ్లకు కనిపిస్తూంది. ఆలయంలోని మంత్రాలు, మోగుతున్న గంటా రవాలు చెవులకు సోకుతున్నట్లున్నది. తాను (అక్కమహాదేవి) ఆనంద పరవశురాలైంది. హృదయోద్వేగాన్ని భరించ లేకపోతూంది. శివపంచాక్షరి జపిస్తున్న పెదవుల కదలిక ఆగిపోయింది. చేతిలో జపమాల జారిపోయింది. కళ్లు మూతబడ్డాయి. ఒక దివ్యజ్యోతి అక్కమహాదేవి నుంచి వెడలి మల్లికార్జునస్వామి ఆలయం వైపు సాగి స్వామిలో అంతర్లీనమైంది. అక్క మహాదేవి తపోమయ శరీరం వాలిపోయింది. ఆమె పెంచుకున్న చిలుక అచేతనమై ఆమె శరీరంపై వాలిపోయింది. మునెమ్మ, చెంచులు, కన్నీటితో అక్కమహాదేవి పార్థివ శరీరానికి తుది వీడ్కోలు చెప్పారు.

శతాబ్దాలు గడచినా నేటికీ అక్కమహాదేవి చరిత్ర శివభక్తుల హృదయాలలో గూళ్లు కట్టుకొన్నది. శ్రీశైల యాత్రికులు కదళీవనంలోని అక్కమహాదేవి గుహలను దర్శించి ధన్యులమనుకుంటున్నారు.

గమనిక : వేదాన్తభేరి పోషక చందాదారులు మరల చందా కట్టబనిలేదు. పత్రిక నడుస్తుంత వరకు వారికి పత్రిక పంపబడును.

నీవెవరు?

–ఎ. తారాలక్ష్మి, ఎం.ఎ., ఎం.ఇడి., ఎమ్.ఫిల్. పి.హెచ్.డి. (శ్రీకాళహస్తి)

- అవాఙ్మానస గోచరమైన చైతన్యానంద స్వరూపమే నీవు.
- ఏ జ్ఞానము శరీర త్రయము కంటె భిన్నమైనదో, పంచకోశములకు అతీతమైనదో, అవస్థాత్రయమునకు సాక్షి అయినదో అదియే నీ స్వరూపము.
- ఏ జ్ఞానము సత్, చిత్, ఆనంద స్వరూపమైన పరమాత్మ రూపమో అదియే నీ స్వరూపము.
- స్థూల, సూక్ష్మ కారణ శరీరములను ఏది ప్రకాశింపజేయుచున్నదో ఆ జ్ఞానమే నీ స్వరూపము.
- జాగ్రద్, స్వప్న, సుషుప్తి మరియు తురీయములకు అతీతమైన జ్ఞానమే నీ స్వరూపం.
- మనస్సు, బుద్ధి మొదలగు సర్వ పదార్థములను తెలిసికొను సాక్షిరూపమైన చైతన్యము ఏది కలదో అదియే నీ స్వరూపము.
- అంతఃకరణములను, వాటి వృత్తులను సత్తా వంతము చేయు జ్ఞానము ఏదియో అదియే నీ స్వరూపము.
- భూత, భవిష్యత్, వర్తమాన కాలములందు కలుగు నట్టి పదార్థములను ప్రకాశింపజేయు జ్ఞానము ఏదికలదో అదియే నీ స్వరూపము.
- ఏ జ్ఞానము సమస్త దేశ, కాల, వస్తువులలో అస్తి, భాతి ప్రియ రూపముగ సర్వదా భాసించుచున్నదో అదియే నీ స్వరూపము.

- ఏ జ్ఞానము ప్రత్యక్షాది ప్రమాణముల చేత తెలిసికొనుటకు వీలుపడదో, దేనిద్వారా ప్రత్యక్షాది ప్రమాణములు తెలిసి కొనబడుచున్నవో అదియే నీ స్వరూపము.
- దేనినైతే ఎన్నటికీ మనస్సు మననము చేయజాలదో, దేనిని బుద్ధి నిశ్చయింపజాలదో, దేనిని చిత్తము చింతన చేయజాలదో, దేనిని అహంకారము అహంభావన చేయజాలదో అదియే నీ స్వరూపము.
- ప్రమాత, ప్రమేయం, ప్రమాణం, జ్ఞాత జ్ఞేయం జ్ఞానం, ద్రష్ట దృష్టి దర్శనం మొదలగు త్రిపుటి ఏ జ్ఞానముయొక్క ఉనికి మాత్రము చేతనే సిద్ధమగుచున్నదో ఆ చైతన్యమే నీ స్వరూపము.
- నిర్వికారం, నిర్వికల్పం, అచలం, అసంగం నీ స్వరూపమై ఉన్నది.
- అస్తి, భాతి, ప్రియ రూపమగు బంధరహితమైన ఆత్మయే నీ స్వరూపము.
- సత్యం, జ్ఞానం, అనంతమగు జ్ఞానమే నీ స్వరూపం.
- దృశ్యరూపముగ నీవు దర్శింపజాలనిది నీ స్వరూపము.
- ఆకాశము వలె సమానముగ, సర్వము నందు పూర్ణమైన ఆత్మయే నీ స్వరూపము.
- ఆభరణముల వంటి జీవ జగదీశ్వరులలో సువర్ణము వలె ఏక రూపమైన ఆత్మ స్వరూపమే నీవు.
- సర్వావస్థల యందును నీ దేహములో భాసించుజ్యోతిస్వరూపుడవు నీవు
- ఆది మధ్యాంతరములు లేని అనంత స్వరూపుడవు నీవు.
- సర్వమునకు స్వరూపమైన పూర్ణ ఆత్మ స్వరూపమే నీవు.
- నామ రూపములకు అతీతమైన సాక్షీభూత స్వరూపుడవు నీవు.

- నిర్వికారమైన, సర్వాతీతమైన చైతన్య స్వరూపమే నీవు.
- ఏకరసమైన సాక్షి చైతన్యమగు ఆత్మ స్వరూపమే నీవు.
- మనస్సుకు,మనో ధర్మములకు సాక్షియైన చైతన్య స్వరూపుడవు నీవు.
- హర్షశోకములు లేని అసంగుడవైన సాక్షి స్వరూపమే నీవు.
- సుఖ స్వరూపమైన, శ్రేష్ఠమైన చైతన్యాత్మ స్వరూపమే నీవు.
- సమస్త దృశ్య జగత్తుయొక్క ఉత్పత్తి, స్థితి, సంహారములకు ఆధారమైన చైతన్య స్వరూపమే నీవు.
- ఉత్పత్తి, నాశనములు లేని స్వతస్సిద్ధమైన ఆత్మ స్వరూపమే నీవు.
- దేహాది సంఘాతముతోసంబంధము లేని ప్రత్యగాత్మ స్వరూపమే నీవు.
- సత్వ, రజస్సు, తమస్సులు అను త్రిగుణాలకు సాక్షియైన చైతన్యమేనీవు.
- ఏకము అనేకము నీవే అయిన స్వరూపమే నీవు.
- నీవు నిత్యుడవు, నీవు శుద్ధుడవు, నీవు బుద్ధుడవు, సర్వవ్యాపకుడవు, సర్వ శక్తి సమన్వితుడవు, నీవే సత్‌చిత్ ఆనంద పరమాత్మ స్వరూపుడవు.

ఆచార్యుడు

'ఆచార్యః సహరిః సాక్షాత్ చరరూపే న సంశయః । మగ్నానుద్ధరతే లోకాన్ కారుణ్యాత్ శాస్త్రపాణినా'

ఆచార్యుడు ప్రత్యక్షంగా నడయాడుతున్న హరియే.

సంసార సాగరమందు మునిగిపోతున్న జనులను ఆచార్యుడు

దయాళువై శాస్త్రమనే చేతితో ఉద్ధరిస్తాడు. ఇట్టి ఆచార్యుని వర్ణింప ఎవరితరము?

వార్తలు

(01). సెప్టెంబర్ 2వ తేది బుధవారం నాడు భాద్రపపౌర్ణమి సందర్భంగా ఆశ్రమంలో గురుపాదుకలకు అభిషేకం, అర్చన జరిగినది. పూజానంతరం ప్రసాదవినియోగం చేయబడినది.

ఆశ్రమంలో జరుగుచున్న చాతుర్మాస్యవ్రతం నేడు భాద్రపద పౌర్ణమితో సమాప్తమైనది. సాధు మహాత్ములకు, వ్రతంలో పాల్గొన్న భక్తులకు భిక్ష చేయబడినది. అన్న సంతర్పణ చేయబడినది.

(02). 8-09-2020 తేది భాద్రపద బహుళ షష్ఠినాడు ప్రపంచమంతా దివ్యజీవనాన్ని ప్రచారం చేసిన ప్రేమైకమూర్తి, సదా చిరునవ్వును చిందులాడించే చిద్రూపి, స్ఫురద్రూపి పరమపూజ్య శ్రీశ్రీశ్రీ శివానంద సరస్వతి (ఋషీకేశ్) స్వాములవారి జన్మదినోత్సవం ఆశ్రమంలో జరిగినది. శ్రీ శివానంద స్వామి చిత్రపటానికి పూజ చేయబడింది. నారాయణసేవ జరిగినది. నాటి సాయంకాలం కృత్తిక సందర్భంగా ఆశ్రమ శివాలయంలో ప్రదోషకాలంలో శ్రీసుబ్రహ్మణ్యస్వామి మూర్తికి అభిషేకం, అర్చన జరిగినది.

(03). 09-09-2020 తేది బుధవారం సద్గురు సర్వ సేవా ట్రస్టు బోర్డు సమావేశం జరిగినది.

(04). 16-09-2020 తేది బుధవారం మాసశివరాత్రిసందర్భంగా ఆశ్రమ శివాలయంలో ప్రదోషకాలంలో శివునికి రుద్రాభిషేకం, బిల్వార్చన జరిగినది. పూజానంతరం ప్రసాద వినియోగం జరిగినది.

(05). దేవీ నవరాత్రుల సందర్భంగా ఆశ్రమంలో 23-10-2020 తేది సరస్వతి పూజ, 24-10-2020 తేది దుర్గాపూజ, 25-10-2020 తేది మహాలక్ష్మి పూజ జరుగును.

(06). ఆశ్రమంలో ప్రతిరోజు యధారీతి ఉదయం గీతాపారాయణ, సాయంకాలం 4 1/2 సత్సంగం, అట్లే సాయంకాలం 6.30 గంటల నుండి 7.30 వరకు భజన, సంకీర్తనలు జరుగుచున్నవి.

సాధన చేయుము

నాయనా! సాధన చేయుము. తీవ్ర సాధన చేయుము. సమస్త సంశయాలను విడిచిపెట్టి నీ గురూపదేశము ననుసరించి సాధనలో నిమగ్నుడవగుము. నీ పారమార్థికతను ప్రకటింపక సదా గుప్తముగ సాధన చేయుము. ఏకాంతమగు ఒక మూలకో, వనానికో వెళ్ళి రహస్యంగా నీ హృదయ కుహరంలో ధ్యానం చేయుము.

క్షణిక సుఖములకై శాశ్వత బ్రహ్మానందాన్ని వదలివేయకుము. బ్రహ్మానందాన్ని ఒక మారు రుచి చూచితివా విషయసుఖాలు నీరసాలుగా తోచును.

– స్వామి బ్రహ్మానంద

Regd.No. TRP / 123 / 2018 - 20 October 2020 Rs.10/- R.No.8139/63
Date of Publication 26-09-2020, Permitted to post : 29th, 30th every month.

వాల్మీకి మహర్షి

ఈ పేజీ స్థల దాతలు
సుభద్రా చారిటబుల్ ట్రస్టు
హైదరాబాద్, తెలంగాణ రాష్ట్రం